ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023 5 అనంతపురం

విద్యాదీవెన బహిరంగ సభలో జగన్న స్టిక్కర్లతో విద్యార్థినులు

విద్యావిధానంలో సమూల మార్పులు

◆ వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ క్లాసులు
◆ ప్రభుత్వ పాఠశాలతో ప్రయివేటు పోటీ పడే పరిస్థితి
◆ 'వసతి దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

విద్యాదీవెన బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, నార్పల

'రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చాం. ప్రయివేటుకు ధీటుగా కాదు.. ప్రభుత్వం పాఠశాలలతో ప్రయివేటు బడులు పోటీపడే పరిస్థితి రాబోతోంది.' అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు నార్పల మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి వసతి దీవెన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా వసతి దీవెన కార్యాక్రమం కింద 9.55 లక్షల మందికి రూ.912.71 కోట్లను బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి విద్యార్థులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రయివేటుకు ధీటుగా కాదు... ప్రయివేటు విద్యా సంస్థలే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడే పరిస్థితులను తీసుకొస్తున్నట్టు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తయిన 30,232 పాఠశాలల్లో ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యా బోధన తీసుకురానున్నామని వివరించారు. దీన్ని చూసి ప్రయివేటు విద్యా సంస్థలు సైతం ఈ పద్ధతిని పాటించాల్సి వస్తుందన్నారు. ఉన్నత విద్యా విధానంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడే విధంగా ఉన్నత విద్యా విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో 37 లక్షల నుంచి 40 లక్షలకు పెరిగిందన్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య 87 వేల నుంచి 1.20 లక్షలకు పెరిగిందని చెప్పారు. ఉన్నత విద్యలో తీసుకొస్తున్న మార్పులతో అంతర్జాతీయంగా ఈ రాష్ట్రంలో చదువుకున్న పిల్లలు రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పుడు చెప్పుకోవడానికి ఒక్క సత్యనాదేళ్లనే ఉన్నారని, అటువంటి వారు వందమంది కావాల్సిన అవసరముందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా టాప్ 50 విశ్వవిద్యాలయంలో సీటు వచ్చిన విద్యార్థులకు రూ.1.50 కోట్లు ఖర్చు చేసి విదేశీ విద్యా కానుక ద్వారా ప్రభుత్వమే చదివిస్తుందని చెప్పారు. ఉపాధిని కల్పించే విధంగా ఉన్నత విద్యాలోనూ మార్పులు తీసుకొచ్చినట్టు వివరించారు. ఇంటర్నుషిప్ విధానం తీసుకొచ్చామన్నారు. విద్య ద్వారానే సమాజ మార్పు జరుగుతుందన్న ఆశాభావం తమ ప్రభుత్వానికి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతోనూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీ, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, పోతుల సునీత, జిల్లా కలెక్టర్ గౌతమి ఇతర జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి నేతల ఘనస్వాగతం.. వీడ్కోలు

నార్పలకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలుదేరిన ముఖ్యమంత్రి 10-30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఆరుణ్‌కుమార్‌తో పాటు ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి హెలీక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి నార్పల హెలిప్యాడ్ కు చేరుకున్నారు. నార్పలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషశ్రీ చరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకట్రామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరి సాంబశివా రెడ్డి, కలెక్టర్ ఎమ్.గౌతమి, అనంతపురం డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస రావుతో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు స్వాగతం పలికారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో హెలీక్యాప్టర్ మొరాయించడంతో ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన పుట్టపర్తికి వెళ్లారు. సాయంత్రం అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

కాన్వాయ్‌ను అడ్డుకున్న మోటుమర్ల, తుంపర్తి రైతులు

సిఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి నిర్వాసిత రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. నార్పలలో వసతిదీవెన కార్యక్రమం ముగిసిన అనంతరం హెలీప్యాడ్ మొరాయించడంతో ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన పుట్టపర్తికి బయల్దేరారు. ఈ సమయంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం, ధర్మవరం మండల పరిధిలోని తుంపర్తి, మోటుమర్ల గ్రామ భూ నిర్వాసిత రైతులు తమకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ సిఎం కాన్వాయ్‌ను పోతులనాగేపల్లి లేఅవుట్ వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారు. భూములు పోయినా ఐదు సంవత్సరాలుగా పరిహారం రాకుండా ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే హఠాత్తుగా రోడ్డుపైకి అడ్డంగా వచ్చి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. వెంటనే వాహనాల్లో దిగి కాన్వాయ్‌కు అడ్డంగా వచ్చిన రైతులను పోలీసులు పక్కకు తోసేసి కాన్వాయ్‌ను ముందుకు తీసుకెళ్లారు. అయితే మహిళా రైతులు రోడ్డుపై పోర్లాడుతూ తమ బాధలు ఎవరు వింటారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లుగా పరిహారం కోసం అందరి చూట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికెళ్లి ముఖ్యమంత్రికి విన్నవించుకుందామన్నా అవకాశం కల్పించలేదని చెప్పారు. కనీసం ఇప్పుడు రోడ్డు మార్గంలో తమ ఊరి వద్ద నుంచి ముఖ్యమంత్రి వెలుతున్నారని తెలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళితే ఇక్కడా పోలీసులు అడ్డుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆగి తమ బాధను వినింటే బాగుండేదని చెప్పారు.

శింగనమల నియోజకవర్గానికి పలు హామీలు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శింగనమల నియోజకవర్గానికి పలు హామీలను ఇచ్చారు.

1.చాగల్లు ప్రాజెక్టు కింద ముంపుగ్రామాలుగా ఉన్న ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలకు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకజీ కింద రూ.150 కోట్ల పరిహారం మంజూరు చేస్తాం.

2.గండికోట నుంచి సుబ్బరాయసాగర్‌కు పైప్‌లైన్ ద్వారా ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తాం.

3.యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని చెరువులకు నీరిస్తాం.

4.శింగనమల మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు నిధుల కేటాయింపు చేస్తాం.

5.నార్పల మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణానికి భూ సేకరణకు రూ.కోటి నిధులు కేటాయిస్తాం.

6.శింగనమల మండలం ఈస్టు నర్సాపురంలో బాలికల వసతి గృహాన్ని మంజూరు చేస్తాం.

7.మిడ్‌పెన్నార్ మరమ్మతులకు రూ.3 కోట్లు కేటాయిస్తాం.

8.యల్లనూరు, పుట్లూరు మండలాల్లో చిత్రావతిపై బ్రిడ్జి, కాజ్‌వే నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం.

హెలీక్యాప్టర్‌లో సాంకేతిక సమస్య... రోడ్డు మార్గంలోనే తిరుగు ప్రయాణం

విద్యా వసతి దీవెన కార్యక్రమం ముగిసిన తరువాత ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద జిల్లా నాయకులతో ముచ్చటించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన తిరుగు ప్రయాణం అవడానికి హెలీక్యాప్టర్ ఎక్కాక అది మోరాయించింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆయన రోడ్డు మార్గంలోనే పుట్టపర్తికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరంకు వెళ్లారు.

స్పృహ తప్పిన ఇద్దరు

స్పృహ తప్పి కిందపడిపోయిన విద్యార్థినిని వైద్యశాలకు తీసుకెళ్తున్న సిబ్బంది

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నార్పల బహిరంగ సభలో ఇద్దరు స్పృహ తప్పి కిందపడిపోయారు. ఎస్ఎల్ఎన్ విద్యా సంస్థలో చదువుతున్న పూజితారెడ్డి అనే విద్యార్థిని స్పృహ తప్పిపడిపోయింది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలోకి తీసుకెళ్లి వైద్యులు చికిత్స అందించారు. ఎన్నికల విధులకు వచ్చిన మరో మహిళ కూడా ఇదే రకంగా పడిపోవడం జరిగింది. ఆమెకు చికిత్సను అందించారు. వేసవి కాలమైనప్పటికీ బుధవారం ఆకాశం మేఘావృతమై ఉండి కొంతసేపే వాతావరణ చల్లగా ఉన్నప్పటికీ తరువాత వేడెక్కింది. ఈ ఎండ వేడిమికి ఇద్దరూ అస్వస్థతకు గురయ్యారు.

దేశంలో ప్రజావ్యతిరేక పాలన

◆ మతతత్వ విధానాలు అవలంభిస్తున్న బిజెపి
◆ ఇలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే..
◆ ప్రచారభేరి బహిరంగ సభలో సిపిఎం, సిపిఐ నాయకులు

బహిరంగ సభలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

నరేంద్ర మోడీ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని సిపిఎం, సిపిఐ నాయకులు తెలియజేశారు. దేశానికి నష్టదాయకంగా మారిన కేంద్రంలోని బిజెపి విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి చేపట్టిన ప్రచారభేరీ కార్యక్రమంలో భాగంగా బుధవారం గుంతకల్లు పట్టణంలోని భీరప్ప కూడలి నుంచి మహాత్మా గాంధీ కూడలి వరకు ఎద్దుల బండ్లు, గుర్రాలపై వినూత్న రీతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. 'మోడీ హటావో.. దేశ్‌కి బచావో'.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహాత్మా గాంధీ కూడలి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులు ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అన్ని విధాలుగా దేశాన్ని అధోగతిపాలుజేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లౌకిక ప్రజాస్వామ్య దేశంలో ప్రజల మధ్య కుల, మతం, ప్రాంతాల చిచ్చుపెట్టి మత ఘర్షణలను రేపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షా హైదరాబాద్ పర్యటనలో ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తామని చెప్పడం చూస్తుంటే బిజెపి మతతత్వ విధానాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రానున్న ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బిజెపిని అధికారంలోకి రాకుండా చేయాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందన్నారు. ఇక రాష్ట్రంలో పిచ్చి తుగ్లక్ పాలన సాగిస్తున్న సిఎం జగన్ రెడ్డి మోడీ మోచేతి నీళ్లను తాగుతూ రాష్ట్ర ప్రయోజనాలు మోడీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతే ఓ ఒక్క అధికార పార్టీ ప్రజా ప్రతినిధి రైతులను పరామర్శించక పోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మోడీ సర్కారును నిలదీసే దమ్ము ప్రతిపక్ష నేత చంద్రబాబుకు లేదన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదష్, జిల్లా కార్యదర్శి జాఫర్, నియోజక వర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఎం జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, సిపిఎం, సిపిఐ పట్టణ కార్యదర్శులు బి.శ్రీనివాసులు, గోపినాథ్, సిపిఎం పట్టణ నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్, కసాపురం రమేష్, జగ్గలి రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో అనంత'పూర్'

సీనియర్ ఇంటర్‌లో 67శాతం జూనియర్‌లో 57 శాతం ఉతీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉతీర్ణత గత ఏడాది కంటే తగ్గింది. బుధవారం సాయంత్రం ఇంటర్మీడియట్ ఫలితాలు గురించి ఆర్ఐఒ సురేష్ బాబు విలేకరులకు తెలియజేశారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 25,249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుజ అయ్యారు. అందులో 14,504 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లా ఉతీర్ణత శాతం 57గా ఉంది. 10,745 మంది ఫైల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 25,126 పరీక్షలు రాయగా అందులో 16,943 ఉతీర్ణత సాధించారు. ఉతీర్ణత శాతం 67గా ఉంది. 8,183 ఇందులో ఫెయిల్ అయ్యారు. ఇక ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 2828 మందికి గాను 1039 మంది, ద్వితీయ సంవత్సరంలో 2711 మందికి గాను 1231 మంది ఉతీర్ణత సాధించారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నూతన సాంకేతిక ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో టిడిపి ముందుంటుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పార్టీ ఆదేశాలకు అనుగుణంగా సాంకేతికంగా పరిణితి సాధించాలన్నారు. ఓటరు జాబితా పరిశీలన వేగంగా జరగాలన్నారు. జగన్ దుష్టపాలన గురించి ప్రజలకు తెలియజేయడంలో టిడిపి సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వైసీపీ దొంగ ఓట్లను సృష్టించడంలో, వేయించడంలో ఆరితేరిందన్నారు. బిఎల్ఏలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు దొంగ ఓట్లను గుర్తించడంలో క్రియా శీలకంగా పని చేయాలన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో సోషల్ మీడియాతో పాటు క్లస్టర్లు, యూనిట్ ఇన్‌ఛార్జిలు టిడిపి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు గిరిమల్లప్ప, లాలేప్ప, బలరామి రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మోహన్ రెడ్డి, ధనుంజయ, కేశవరెడ్డి, ఆనంద్, మారుతి, నాగరాజు, ఇనాయత్, పురుషోత్తం, కాలవ సన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

జెసి.దివాకర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాల్సిందే..

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేంత వరకూ నిరసనలు కొనసాగిస్తామని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద జెసితోపాటు కౌన్సిలర్లు చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈయన దీక్షకు పట్టణంలోని పలు ప్రజా సంఘాల నాయకులు, ఆర్ఎంపి సంఘం నాయకులు, నాయీబ్రాహ్మణ మహిళలు, స్వర్ణకారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తర్వాత ప్రభాకర్‌రెడ్డి సోదరుడు జెసి దివాకర్‌రెడ్డి కూడా దీక్షా శిబిరాన్ని సందర్శించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డితో చాలాసేపు సమాలోచనలు చేశారు. ముఖ్యంగా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. అనంతరం జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు తమ వద్దకు వచ్చి పాలకవర్గ 15 డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక కమిషనర్ మార్కెట్ వేలంపాటలు నిర్వహించకుండా పురపాలక సంఘానికి నష్టం తెచ్చారన్నారు. కౌన్సిల్ ఆమోదం లేని పనులు చేపట్టిన పురపాలక సిబ్బందిని తొలగించాలని, అధికార పార్టీ వారికి వత్తాసు పలుకుతూ ఉన్న కమిషనర్ వైఖరి మార్చుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. కౌన్సిల్ తీర్మానాన్ని ధిక్కరిస్తూ సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై తీసుకురావడం, పట్టణంలో అండర్ గ్రౌండ్ వ్యవస్థకు సంబంధించి పనులు చేపట్టకపోవడం, కమిషనర్ మున్సిపల్ చట్టం రూల్ నెంబర్.3 అనుసరించకపోవడం, మున్సిపల్ చట్టంలో పొందుపరిచిన రూల్స్ విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌పై జిల్లా అధికారులు చర్యలు చేపట్టకపోవడం, పురపాలక సంఘంలో డీజిల్ అన్యాక్రాంతం చేస్తున్న అధికారులపై కమిషనర్ చర్యలు చేపట్టకపోవడం వంటి సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఉరవకొండ

మొక్కలను నాటి పరిరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేష్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని చిన్న ముష్టూర్‌లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలు నాటాయరు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చెట్లే జీవకోటికి ప్రాణధారమన్నారు. అయితే కాలానుగుణంగా ఎన్నోమార్పులు వస్తున్నాయన్నారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ధనలక్ష్మి, సులోచన, చంద్రం బాబు, సురేష్, చంద్రమోహన్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యుడు, తన తమ్ముడు కమలాకర్ కుమారుడు లక్ష్మీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, దేవప్రసాద్, చంద్రశేఖర్, కిష్టప్ప, పాపయ్య, సుబ్బారావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఇంటర్ ఫలితాల్లో 'నలంద' సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న నలంద అధ్యాపకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరంలోని నలంద కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో ముప్వ ప్రజ్ఞశ్రీ 988/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే జి.ఆకాష్ సుధీంద్ర 981, గౌతమి 980, ఈ.అవీన్ చోప్రేదర్ 979 అత్యుత్తమ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఎం.ఖాజీబాబు బుధవారం తెలిపారు. ఎంఈసీ విభాగంలో తనూషా రెడ్డి 1000 మార్కులకు గానూ 979, వినీల 978, తరుణ్ 975, సీఈసీ విభాగంలో వై.శంభవి 947, విజయ్‌కుమార్ 932, బైపీసీ విభాగంలో కె.సమత 961, ఎస్.వర్షిత 956, డి.చందన 954 మార్కులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అందుకు కృషి చేసిన అధ్యాపకులను నలంద విద్యాసంస్థల ఛైర్మన్ అట్లూరి విజయబాబు, ఆంధ్ర, కర్ణాటక రీజినల్ హెడ్ కేతినేని మాధవరావు అభినందించారు.

జూనియర్ ఇంటర్ సీఈసీ డిస్ట్రిక్ టాపర్ లతశ్రీ

జూనియర్ ఇంటర్ సీఈసీ విభాగంలో నలంద జూనియర్ కళాశాల విద్యార్థిని లతశ్రీ 482/500 మార్కులు సాధించి ఉమ్మడి అనంతపురం జిల్లా టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ తెలిపారు.

లతశ్రీ 482

'శ్రీసాయి' విజయదుందుభి

వసుంధర-971 నిహారిక-458 అనిత-422

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరంలోన శారదా నగర్‌లో ఉన్న శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించినట్లు ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో వసుంధర 971/1000, జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో నిహారిక 458/470, బైపీసీ విభాగంలో బి.అనిత 422/440 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు. వీరితో పాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను శ్రీసాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ మాధురీ రాజేశ్వరరావు అభినందించారు.

అధునాతన హంగులతో ఎగ్జిబిషన్

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ ఫక్రుద్దీన్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలో మును పెన్నడూ లేనివిధంగా కనీవినీ ఎరుగని రీతిలో అబ్బురపరిచే అధునాతన హంగులతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌కె ఎగ్జిబిషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ తెలిపారు. ఈమేరకు బుధవారం సాయంత్రం నగర శివారులోని రుద్రంపేట బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను రుత్విక్ రెడ్డి, మహమ్మద్ ఫైజన్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల పెంపుడు జంతువులు, రంగురంగుల పక్షుల ప్రదర్శన, చిన్నపిల్లలు, మహిళలు, పెద్దలందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం వినోదాన్ని కల్పించే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా భారీ గొరిల్లా ముఖద్వారంతో, త్రీడీ సెల్ఫీ సెట్టింగులు, వాటర్ ఫౌంటేషన్లు నిర్మించామన్నారు. వీటితోపాటు జాయింట్ వీల్, కొలంబస్, సాలంబో, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రైన్, వాటర్ బోటింగ్, డక్ ట్రైన్, బేబీ ట్రైన్, జోకర్ ట్రైన్, మోటర్ సైకిల్స్, కార్స్ రైడింగ్, దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఆకర్షణీయమైన జ్యూవెలరీ ఐటమ్స్, కిచెన్ ఐటమ్స్, ప్లాస్టిక్ సామాన్లు, పింగాణీ వస్తువులు, చిన్న పిల్లల ఎలక్ట్రానిక్ ఆట వస్తువులు, కాటన్ రెడీమేడ్ దుస్తులు, చెప్పుల దుకాణాలు, మహిళల కోసం ప్రత్యేకమైన ఫ్యాన్సీ వస్తువులు, గృహోపకరణాలు తదితర షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఢిల్లీ మసాల పాపడ్, రాజస్థాన్ ఛాట్ బండార్, వివిధ రకాల ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్, స్మోక్ బిస్కెట్, తదితర ప్రత్యేక రుచికరమైన తినుబండారాలు సరసమైన ధరలకే ఎగ్జిబిషన్‌లో లభిస్తాయన్నారు. ప్రజలందరూ ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు కావాల్సిన వినోదం, ఆహ్లాదాన్ని పొందవచ్చని తెలిపారు.

నాయకుల ముందస్తు అరెస్టు.. విడుదల

రాయదుర్గం పోలీసుల అదుపులో ఉన్న ఎస్‌ఎఫ్‌ఐ, సిపిఎం, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా స్థానిక పోలీసులు ఎస్ఎఫ్ఐ, సిపిఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, చేనేత కార్మిక సంఘం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, సిపిఎం నాయకులు మల్లికార్జున, రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు మధు, తిమ్మరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి, ఏఐవైఎఫ్ నాయకులు కుమార్ నాయక్, అనిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, వంశీలను పోలీసులు అదుపులో తీసుకొని మధ్యాహ్నం 2 గంటల అనంతరం వదిలిపెట్టారు. సీఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటారనే ఉద్దేశ్యంతో పోలీసులు వీరిని అదుపులో తీసుకొని అనంతరం వదిలివేశారు. అదుపులోకి తీసుకోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకొన్న వారిలో ప్రజాసంఘాల నాయకులు తిప్పేస్వామి నాయక్, అచ్యుత్ ప్రసాద్, ధనుంజయ నాయక్, ఆర్‌కే.రాజు, అశ్వర్థ, విరుపాక్షి, తదితరులు ఉన్నారు.

ప్రజా సంఘాల అడ్డగింత అప్రజాస్వామికం

కళ్యాణదుర్గం : తమ హక్కులను ప్రశ్నించేందుకు యత్నించిన ప్రజా సంఘాల నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామికమని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం నార్పలకు వస్తున్న సందర్భంగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే పర్యటనను అడ్డుకుంటామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. కాగా వారిని సీఎం పర్యటనకు వెళ్లనివ్వకుండా ముందుగానే

కళ్యాణదుర్గం పోలీసుస్టేషన్‌లో ఉన్న ప్రజా సంఘాల నాయకులు

జీడిపల్లి ముంపు బాధితులకు

పరిహారం అందించండి..

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం శింగనమల నియోజకవర్గం నార్పల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణంతో కిందభాగాన ఉన్న జీడిపల్లి గ్రామస్తులు ఊటనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. కావున ఆర్‌అండ్‌ఆర్ పథకం కింద పునరావాసం కల్పించేందుకు ప్రాతిపాదిత రూ.82.12 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేసి రాజకీయ కారణాలతో పూర్తి

సిఎంకు మాజీ ఎమ్మెల్యే విశ్వ వినతి

కాకుండా ఆగిపోయిన రాకెట్ల-ఆమిద్యాల లిఫ్ట్ పనులను యుద్ధప్రాతిపదికన మొదలు పెట్టాలని విన్నవించారు. ఈ లిఫ్ట్ నిర్మాణానికి ఇప్పటికే 70 ఎకరాల భూసేకరణ చేసి కాలువ పనులు పూర్తి చేశారన్నారు. అయితే వీటికి సంబంధించిన పరిహారం రూ 8.50 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. వీటితో పాటు జిల్లాలో ఉన్న కరువు వంటి ప్రత్యేక పరిస్థితులు దృష్ట్యా నవరత్న పతకాలు అమలుకు సంబంధించి నిబంధనలు సడలించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల కన్వీనర్ శ్రీనివాసులు దుద్దేకుంట రామాంజనేయులు, కరుణాకర్, నరిగన్న, తదితరులు పాల్గొన్నారు.



నిఖిత 968 విష్ణువర్ధన్‌నాయుడు 950 సాయి బాలాజీ 900 మెహతాబ్‌బాను 918 శశిధర్ 953 నరేష్ 904 అనంత కుమార్ 896

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీమేధ' ప్రభంజనం

ప్రజాశక్తి-అనంతపురం

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో నగరంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీమేధా జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రభంజనం సృష్టించినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీధర్ తెలిపారు. ప్రథమ సంవత్సరం 80శాతం, ద్వితీయ సంవత్సరం 90 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎంపిసి విభాగంలో మనోహర్ (458 మార్కులు) కీర్తి 406, ఎంఇసి విభాగంలో నేహశ్రీ 472, స్వర్ణ 457, సీఈసీ విభాగంలో మాధవి 446, వెన్నెల 443, బైపిసి విభాగంలో దీవెన 358 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఎంపీసీ విభాగంలో నిఖిత (968 మార్కులు) విష్ణువర్ధన్ నాయుడు 950, సాయి బాలాజీ 900, మెహతాబ్‌బాను 918, ఎంఇసి విభాగంలో శశిధర్ 953, మార్కులు నరేష్ 904, అనంత కుమార్ 896, సీఈసీ విభాగంలో జయశ్రీ 865, బైపీసీ విభాగంలో బీసీ కాంత్‌రెడ్డి 899, సాయి 898, మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని తెలిపారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపక అధ్యాపకేతక సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.

మనోహర్ 458 నేహశ్రీ 472 మాధవి 446 వెన్నెల 443 హృషికేష్‌రెడ్డి 909 సాయి మానస 898

'శ్రీవికాస్' విజయభేరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని శ్రీ వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ప్రథమ ఇంటర్ ఎంపిసి విభాగంలో ఎన్.భావన రెడ్డి 464/470 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే ఎస్.వసుధశ్రీ 462, పి.భానుప్రకాష్ 463, ఓ.పూజిత 459, వి.లికిత సాయి 456, వి.వేద 456, వి.వినీషా 455 మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్ ఎంపిసి విభాగంలో కె.ఆరీఫ్ పర్వీన్ 964/1000 మార్కులు, ఎం.లిఖిత 937, పి.దివ్య 933, బి.కౌశిక్ 933 మార్కులు సాధించారు. అత్యధిక మంది విద్యార్థులు ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులై కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కె.జయభాస్కర్, కె.సుబ్రహ్మణ్యం, సిబ్బంది అభినందించారు.

ఎన్.భావన రెడ్డి 464 పి.భానుప్రకాష్ 463 ఎస్.వసుధశ్రీ 462

కోత దశలో రబీ వేరుశనగ

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలవ్యాప్తంగా రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తున్నట్లు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ధర కూడా బాగానే ఉండటంతో లాభసాటిగానే ఉందని చెబుతున్నారు. సాధారణంగా ఎకరాలో వేరుశెనగ పంట సాగు చేయాలంటే రూ.35 నుంచి రూ.37వేల వరకూ పెట్టుబడి అవుతుంది. సేద్యానికి రూ.2,600, అడుగు పిండికి రూ.2,500, వేరుశనగ విత్తనాలకు రూ.10,500, విత్తడానికి రూ.1,200, గులికలకు రూ.400, రెండుసార్లు స్ప్రే చేయడానికి రూ.5వేలు, కలుపు రెండుసార్లు తీసేందుకు రూ.5వేలు, చేను తీయడానికి, మిషన్‌కు, ఇతర ఖర్చులు కలిపి పెట్టుబడి సుమారు రూ.35వేలు దాటుతుంది. ఈనేపథ్యంలో పంట సాధారణ దిగుబడి వస్తే అన్నీ పోనూ రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు లాభం వస్తుంది. ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తే క్వింటా రూ.7వేల చొప్పున రూ.70 వేల వరకు వస్తుంది. ఈలెక్కన పెట్టుబడి రూ.35 వేలు పోనూ రూ.35 వేల వరకు మిగులుందని రైతులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఈసారి రబీ సీజన్‌లో వేరుశెనగ సాగు చేసిన రైతులకు మాత్రం ఆశించిన లాభాలు వస్తున్నాయని చెప్పవచ్చు.

సీఎం జగన్ సభ అట్టర్ ప్లాప్

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

నార్పలలో నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సభ అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. రాయదుర్గంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వసతి దీవెన లబ్ధిని బటన్ నొక్కి విడుదల చేసేందుకు జగన్ నార్పలలో బహిరంగ సభ నిర్వహించగా జనం రాకపోవడంతో వైసిపి శ్రేణులు యూనివర్సిటీ విద్యార్థులను బస్సుల్లో తరలించారని ఎద్దేవా చేశారు. జేఎన్టీయూ, ఎస్‌కే యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు వైసిపి సానుభూతిపరులా అని ప్రశ్నించారు. ఇంటర్నల్, సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశారంటే వర్సిటీ వ్యవస్థ దిగజారిపోయిందా లేక సీఎం సభ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని భయం పట్టుకుందా అని ప్రశ్నించారు. సీఎం సభలకు యూనివర్సిటీ విద్యార్థులను తరలించడం దుష్ట సంప్రదాయం అన్నారు. నార్పలలో ఇటీవలే రూ.250 కోట్ల పంట నష్టం జరిగితే స్థానిక ఎమ్మెల్యే దానిపై సీఎంతో స్పష్టమైన హామీ ఇప్పించలేకపోయారన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి సీఎం మాటమాత్రమైనా మాట్లాడలేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాల బిందు సేద్యం గురించీ ప్రస్తావించలేదన్నారు. సీఎం జిల్లాకు ఎందుకొచ్చినట్లు, ప్రజలకు ఏం సందేశం ఇచ్చారన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు సీఎం చేత జిల్లా గురించి మాట్లాడించలేదంటే వారు ఎలాంటి బానిస బతుకులు బతుకుతున్నారో అర్థమవుతోందన్నారు. వారు పదవుల్లో ఉండి ప్రయోజనమేంటన్నారు. జగన్ ఈ నాలుగేళ్లలో జిల్లా భవిష్యత్తును నాశనం చేశారని, దీంతో 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. ప్రాజెక్టులు నిర్వీర్యం అయ్యాయని జీడిపల్లి, పేరూరు, బిటి ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకం కోసం ఒక్క రూపాయి పని కూడా జరగలేదన్నారు. సీఎం జిల్లాకు వస్తే జిల్లాకు జరిగిన అన్యాయంపై, సమస్యలపై స్పందించాలి, మాట్లాడాలి అని చెప్పకపోతే అలాంటి పదవులు ఉంటే ఏమి ఊడితే ఏమి అన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నాలుగేళ్లలో రాయదుర్గం నియోజకవర్గంలో అభివద్ధి పనులకు ఎంత ఖర్చు చేశారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా మానసిక ఆందోళనకు గురవుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు ముఖ్యమంత్రి నైజాన్ని, నయవంచనను గ్రహించాలని కోరారు. జిల్లాను బాగు చేసేది, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యవసాయ రంగాన్ని అభివద్ధి చేసేది టిడిపి అధినేత చంద్రబాబు మాత్రమే అన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా వ్యతిరేక పాలనను కొనసాగిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించడానికి ప్రజలందరూ సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 14వతేదీ నుంచి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రచార భేరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నటున్ల తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా బిజెపి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి చైతన్యపరుస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు యత్నిస్తోందన్నారు. మరోవైపు బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలనే రాష్ట్రంలో సిఎం జగన్ బలపరచడం శోచనీయమన్నారు. 31 మంది ఎంపీలు, 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించి రాష్ట్రానికి రావలసిన నిధులను రాబట్టడంలో విఫలమయ్యాడన్నారు. ముఖ్యంగా 32 మంది బలిదానం తర్వాత సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ పరం చేసేందుకు పూనుకున్నా జగన్ నోరు మెదపడం లేదన్నారు. వివేక హత్య కేసును నీరు గారిచేందుకు సిఎం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ఈ రెండు ప్రభుత్వాలు చేస్తున్న అరాచకపాలనపై వామపక్షాలు చేస్తున్న ఆందోళనలకు ప్రజలందరూ సంపూర్ణంగా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, నాగరాజు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, ఉరవకొండ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, చెన్నారాయుడు, సుల్తాన్, నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

శింగనమల ద్వితీయశ్రేణి నాయకుల నిరుత్సాహం

ప్రజాశక్తి-నార్పల

ముఖ్యమంత్రి నార్పలకు విచ్చేసిన సందర్భంగా ఆయన్ను కలిసేందుకు శింగనమల నియోజకవర్గంకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి బహిరంగ సభా ఏర్పాటు చేసిన క్రాసింగ్ వరకు ముఖ్యమంత్రి, మంత్రులు ఎమ్మెల్యేలు బస్సులో ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి శింగనమల నియోజకవర్గం వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలుస్తారని భావించారు. ఈ మేరకు నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులు భారీ ఎత్తున నార్పలకు చేరుకున్నారు. అయితే ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ముగించుకుని ఎవరినీ కలువకుండానే వెనుదిరిగారు. శింగనమల నియోజకవర్గం నాయకులకు కాకుండా ఉమ్మడి జిల్లాకు చెందిన ఇతర నేతలకు వివిపి పాసులు ఇవ్వడంతో స్థానిక నేతలకు అవకాశం దక్కలేదు. దీంతో శింగమల ద్వితీయ శ్రేణి నాయకులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అయినా ముఖ్యమంత్రితో ద్వితీయ శ్రేణి నాయకులు కలిసేలా చర్యలు తీసుకోవాల్సిందని వైసిపి నేతలు గుసగుసలాడారు.

ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులను వేధిస్తే ఉద్యమిస్తాం

పది మూల్యాంకనం కేంద్రం వద్ద ఫ్యాప్టో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అకారణంగా ఉపాధ్యాయులను వేధింపు చర్యలు వీడకుంటే ఉద్యమిస్తామని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులపై విద్యా శాఖ ఉన్నతాధికారులు పర్యటనలు చేస్తూ మెమోలు, సస్పెండ్ వంటి చర్యలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో పదోతరగతి మూల్యాంకనం కేంద్రం కెఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ జి.లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణారెడ్డి, లింగమయ్య, నరసింహులు, రవీంద్ర, సూర్యుడు, జి.వెంకటేష్ తదితరులు హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేదనే సాకుతో ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు, సస్పెన్‌లు చేయడం దారుణంగా ఉందన్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేయడం ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రశాంతంగా విద్యను బోధించే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యేతర కార్యక్రమాలు ఉపాధ్యాయులకు కేటాయించరాదన్నారు. ఉపాధ్యాయులు విద్యా రంగ బాగు కోసం చేపట్టే సంస్కరణలను ఆహ్వానిస్తామన్నారు. అణచివేత ధోరణి సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సర్దార్‌వలి, వన్నప్ప, చిదంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలను కలిసిన శింగనమల నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, సీనియర్ నాయకులు దాసరి గంగాధర్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో శింగనమల నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బీసీ సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్ గౌస్, రంగస్వామి, రవి, తదితరులు పాల్గొన్నారు.

'మేధోసంపత్తి.. హక్కులు'పై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

మేధో సంపత్తి.. హక్కులు అనే అంశంపై నగరంలోని శ్రీవాణి కళాశాలలో ఐపిఆర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురానికి చెందిన అటార్నీ, కౌన్సిలర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జ్ఞానం ఎవరి సొత్తూ కాదన్నారు. సొంత జ్ఞానంతో సంపాదించిన ఏ విషయంపైనైనా హక్కు మనకే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణీ కళాశాల ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ జి.ప్రత్యూష, ప్రిన్సిపల్ కె.హెచ్.వనజమ్మ, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ బి.భాస్కర్‌రెడ్డి, కళాశాల ఎఒ పి.సుధాకర్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం గారూ.. 'అనంత' సమస్యల ప్రస్తావనేదీ..

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ పర్యటన అనగానే జిల్లాకు ఏదో ఉద్ధరించే హామీ ఇస్తారని ఆశించిన ప్రజలకు జగన్ నిరాశ పరిచారని, కేవలం బటన్ నొక్కడం మినహా ఆయన చేసేదేమీ లేదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ విమర్శించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్ ఎప్పటిలాగే ప్రతిపక్షాల్ని విమర్శించేందుకే పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక సమస్యలు తాండవిస్తున్నా వాటి గురించి కనీస ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇంతవరకు ఒక్క రైతన్నకు కూడా సబ్సిడీతో డ్రిప్పులు, స్ప్రింకర్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో ఉన్న నార్పల మండలంలో సభ పెట్టి ఎస్సీల అభివృద్ధి, అభ్యున్నతికి కనీసం మాట ఎత్తలేదన్నారు. ఆఖరికి ఈ జిల్లాలోనే ప్రారంభించిన కంటి వెలుగు పథకం సైతం మసకబారిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, జిల్లా కార్యదర్శి కిరణ్, జిల్లా సంయుక్త కార్యదర్శి అవుకు విజయకుమార్, ముప్పూరి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

10 వరకు 'ఓపెన్' వర్శిటీ పరీక్ష ఫీజు గడువు

అనంతపురం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్, ఓల్డ్ బ్యాచ్ ఇయర్లీ ఎగ్జామ్స్ ఒకటి, రెండు, మూడు సంవత్సరాల పరీక్ష ఫీజును మే 10వ తేదీ వరకూ చెల్లించవచ్చని యూనివర్సిటీ అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శేషారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దొంగల అరెస్టు

యాడికి : మండలంలోని రాయలచెరువు మోడల్ స్కూల్ సమీపంలో ఆపి ఉంచిన లారీలోకి చొరబడి చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం కోనాపురానికి చెందిన బోయ మధు, కర్నూలు జిల్లా నల్లమేకలపల్లికి చెందిన రజాక్‌ను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు